నేటి మ్యాచ్
భారత్ X బంగ్లాదేశ్
మ. 2.00 నుంచి
వేదిక: పుణె

జర భద్రం!

నేడు బంగ్లాదేశ్, భారత్ పోరు

వన్డే ప్రపంచకప్‌లో చిన్న జట్లు దుమ్మురేపుతున్న దశలో.. టీమ్‌ఇండియా ఓ క్లిష్ట సవాలుకు సిద్ధమైంది! ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ అలవోక విజయాలు సొంతం చేసుకున్న రోహిత్ సేన నేడు బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఇటీవల బంగ్లాతో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట ఓడిన భారత్.. మరి ఈ సారి ఏం చేస్తుందో చూడాలి!

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలని.. ఇటీవల అఫ్గానిస్థాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌లు నిరూపించగా.. టీమ్‌ఇండియా కూడా ఎలాంటి ప్రయోగాల జోలికి పోకుండా పూర్తిస్థాయి బలగంతో బరిలోకి దిగి బంగ్లా టైగర్స్ పొగరు అనచాలని అభిమానులు ఆశిస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్నీ రంగాల్లో టీమ్‌ఇండియా సమతూకంగా ఉన్నా.. తమదైన రోజున బంగ్లాదేశ్ ఎంత ప్రమాదకారో గతంలో పలుమార్లు నిరూపించింది. ఈ నేపథ్యంలో ఉదాసీనతకు తావివ్వకుండా.. జట్టంతా సమిష్టిగా కదంతొక్కాలని ఆశిద్దాం!

పుణె: స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్న టీమ్‌ఇండియా గురువారం పుణె వేదికగా బంగ్లాదేశ్‌తో తలపడనుంది. బలం, బలగం ప్రకారం పేపర్ మీద చూసుకుంటే.. బంగ్లాదేశ్ కన్నా రోహిత్ సేన ఎన్నో రెట్లు మెరుగ్గా ఉన్నా.. సమీప చరిత్ర మాత్రం భిన్నంగా కనిపిస్తున్నది. ఇటీవల ఆసియా కప్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన పోరులో భారత్ ఓటమి పాలవగా.. ద్వైపాక్షిక సిరీస్‌లోనూ ఆ జట్టు చేతిలో మనవాళ్లు ట్రోఫీ కోల్పోయారు. ఈ లెక్కలు చూస్తే ఇటీవలి కాలంలో బంగ్లా ఎంత ఎదిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌పై అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచకప్‌లో సంచలనం నమోదు చేస్తే.. దక్షిణాఫ్రికాపై గెలుపుతో నెదర్లాండ్స్ భూకంపం పుట్టించింది. ఆ జట్లను స్ఫూర్తిగా తీసుకొని బంగ్లా కూడా భారత్‌ను నిలువరించాలని గట్టి ప్రయత్నాలు చేస్తుంటే.. కప్పు దారిలో ఎదురైన వాళ్లందరినీ తుక్కు కింద కొట్టాలని టీమ్‌ఇండియా భావిస్తున్నది. తొలి పోరులో ఆస్ట్రేలియాను మట్టికరిపించిన రోహిత్ సేన ఆ తర్వాత వరుసగా అఫ్గానిస్థాన్, పాకిస్థాన్‌పై విజయదుందుభి మోగించింది. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ ఏ ఒక్కరి ప్రదర్శన పైనో కాకుండా.. జట్టు సమిష్టిగా సత్తాచాటి గెలువడం సానుకూలాంశం. డెంగ్యూ నుంచి కోలుకొని జట్టులోకి వచ్చిన యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌పై భారీ అంచనాలు ఉండగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అదే జోరు కొనసాగించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తున్నది. ఇక మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా కీలకం కానున్నారు. ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్‌కు జట్టులో చోటు ఖాయమే. శార్దూల్ స్థానంలో మహమ్మద్ షమీ, అశ్విన్‌లో ఒకరిని ఆడించాలనే వ్యాఖ్యలు వినిపిస్తున్నా.. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చేది లేదని బౌలింగ్ కోచ్ పారస్ మాంబ్రే ప్రకటించాడు. అంటే ఈ మ్యాచ్‌లోనూ శార్దూల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండనున్నాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ బాధ్యతలు నిర్వర్తించనుండగా.. జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ పేస్ భారం మోయనున్నారు. మరోవైపు పాతికేండ్ల తర్వాత భారత గడ్డపై వన్డేల్లో టీమ్‌ఇండియాను ఎదుర్కోనున్న బంగ్లాదేశ్.. సంచలన ప్రదర్శన నమోదు చేయాలని తహతహలాడుతున్నది. షకీబ్ కోలుకున్నట్లే అని ఆ జట్టు కోచ్ పేర్కొనగా.. లిటన్‌దాస్, ముష్ఫికర్ రహీమ్, మహ్ముదుల్లా, ముస్తఫిజుర్ వంటి ప్రతిభావంతులతో కూడిన బంగ్లాను తక్కువ అంచనా వేసేందుకు లేదు.

1 వన్డే ప్రపంచకప్‌లో భారత్‌పై బంగ్లా ఒకే ఒక్కసారి (2007లో) విజయం సాధించింది.

గత రెండు ప్రపంచకప్‌లలోనూ బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌ల్లో రోహిత్ సెంచరీలు సాధించాడు. (2015లో 137 పరుగులు, 2019లో 104)

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, శార్దూల్, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

బంగ్లాదేశ్: షకీబ్ (కెప్టెన్), తన్జిద్, లిటన్, నజ్ముల్, తౌహిద్, ముష్ఫికర్, మెహదీ హసన్, మహ్ముదుల్లా, తస్కీన్, షరీఫుల్, ముస్తఫిజుర్.

పిచ్, వాతావరణం

పుణె పిచ్ బ్యాటింగ్‌కు సహకరించే అవకాశాలెక్కువ. ఇక్కడ జరిగిన గత ఐదు మ్యాచ్‌ల్లో మూడింట తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు మూడొందల పైచిలుకు స్కోర్లు చేశాయి. వాతావరణం పొడిగా ఉండనుంది. సాయంత్రం చిరుజల్లులకు అవకాశం ఉంది.

25 భారత్‌లో భారత్‌తో వన్డేల్లో తలపడటం బంగ్లాదేశ్‌కు పాతికేండ్ల తర్వాత ఇదే తొలిసారి. 1998లో వాంఖడే వేదికగా టీమ్‌ఇండియాతో మ్యాచ్ అనంతరం ఆ జట్టు భారత గడ్డపై మన జట్టుతో వన్డే మ్యాచ్ ఆడలేదు.

ప్రపంచ ఐస్ స్కేటింగ్ టోర్నీకి సిద్ధార్థరెడ్డి

బచ్చన్నపేట : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటిశేశ్వాపూర్ గ్రామానికి చెందిన చల్లా సిద్ధార్థరెడ్డి ఐస్ స్కేటింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. 2024 జనవరి 19 నుంచి 21 వరకు ఫిన్లాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ పోటీకి భారత జట్టులో పాల్గొనే అవకాశం దక్కడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తన పుట్టిన రోజునే ఎంపిక కావడం అదృష్టంగా ఉందని సిద్ధార్థ్‌రెడ్డి తండ్రి రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రోహిత్ శర్మ @ 6

దుబాయ్: వన్డే ప్రపంచకప్‌లో దంచికొడుతున్న టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ సత్తాచాటాడు. బుధవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో ఆరో ర్యాంక్‌కు చేరాడు. ఆజమ్ అగ్రస్థానంలో ఉండగా..రోహిత్‌తో పాటు గిల్ (2వ ర్యాంక్), కోహ్లీ (9వ ర్యాంక్) టాప్-10లో ఉన్నారు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
న్యూజిలాండ్	4	4	0	+1.92	8
భారత్	3	3	0	+1.82	6
దక్షిణాఫ్రికా	3	2	1	+1.38	4
పాకిస్థాన్	3	2	1	-0.13	4
ఇంగ్లండ్	3	1	2	-0.08	2
బంగ్లాదేశ్	3	1	2	-0.69	2
ఆస్ట్రేలియా	3	1	2	-0.73	2
నెదర్లాండ్స్	3	1	2	-0.99	2
అఫ్గానిస్థాన్	4	1	3	-1.25	2
శ్రీలంక	3	0	3	-1.53	0

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

ప్రక్షాళనకు ప్రయత్నం

హెచ్‌సీఏలో అవినీతిని రూపుమాపుతాం • జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధికి ప్రణాళిక

నమస్తే తెలంగాణతో జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)ను ప్రక్షాళన చేయడమే తమ ముందున్న లక్ష్యమని జగన్‌మోహన్‌రావు అన్నారు. అధ్యక్ష స్థానం కోసం పోటీపడుతున్న ఆయన తన విజన్‌ను ఆవిష్కరించారు. నలభై ఏండ్లుగా హెచ్‌సీఏలో పేరుకుపోయిన అవినీతిని పారద్రోలేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ఇన్నాళ్లు హైదరాబాద్‌కే పరిమితమైన హెచ్‌సీఏ కార్యకలాపాలను తెలంగాణలో మిగతా జిల్లాలకు విస్తరిస్తామని అన్నారు. ఈ నెల 20న హెచ్‌సీఏ ఎన్నికల నేపథ్యంలో జగన్‌తో నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూ

హెచ్‌సీఏ అభివృద్ధిపై మీ విజన్?

❖ హెచ్‌సీఏను అభివృద్ధి చేసేందుకు కచ్చితమైన విజన్‌తో ఉన్నాం. గత కొన్నేండ్లుగా కొంత మంది వ్యక్తుల చేతుల్లో హెచ్‌సీఏ బందీగా మారిపోయింది. లెక్కకు మిక్కిలి క్లబ్‌లను అడ్డుగా పెట్టుకుని రాజకీయాలు చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. బహుళ క్లబ్‌లపై నిషేధంతో కొత్తవారికి అవకాశం లభించనుంది. హెచ్‌సీఏను అభివృద్ధి చేసేందుకు అందరితో కలిసి ముందుకు వెళ్తాం.

మీ గెలుపు అవకాశాలపై?

❖ ఈ నెల 20వ తేదీన జరిగే ఎన్నికల్లో మేము స్పష్టమైన మెజారిటీతో గెలువబోతున్నాం. యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ తరపున నేను అధ్యక్ష స్థానానికి పోటీపడుతున్నాను. మొత్తం 173 మంది సభ్యులు కల్గిన హెచ్‌సీఏలో 120 ఓట్లతో గెలుస్తామన్న ధీమా ఉంది. మా ప్యానెల్‌లో అనుభవజ్ఞులైన సభ్యులు ఉండటం కలిసొచ్చే అంశం.

జిల్లాల్లో ఆట అభివృద్ధిపై?

❖ హెచ్‌సీఏను కేవలం హైదరాబాద్ వరకే పరిమితం చేయకుండా తెలంగాణ తతిమా జిల్లాలకు విస్తరింపజేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. అందుకు తగ్గట్లు వివిధ జిల్లా కేంద్రాల్లో స్టేడియాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం తీసుకుంటాం.

హెచ్‌సీఏలో సంస్కరణలపై?

❖ హెచ్‌సీఏకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు శతధా ప్రయత్నిస్తాం. అందుకు పలు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటాం. ఎక్కడా పైరవీలకు తావులేకుండా ప్రతిభకు పెద్దపీట వేస్తాం. నైపుణ్యం ఉన్న గ్రామీణ ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఎంపిక విషయంలో లంచాలు లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తాం.

న్యూజిలాండ్ జైత్రయాత్ర

వరుసగా నాలుగో విజయం • అఫ్గానిస్థాన్‌కు తప్పని ఓటమి

పెద్దగా అంచనాలు లేకుండానే వన్డే ప్రపంచకప్ బరిలోకి దిగిన న్యూజిలాండ్.. వరుస విజయాలతో అదరగొడుతున్నది. ఇప్పటికే హ్యాట్రిక్ ఖాతాలో వేసుకున్న కివీస్.. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అఫ్గాన్‌ను చిత్తుచేసింది. గత మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిచ్చిన కాబూలీలు.. న్యూజిలాండ్‌పై అదే జోరు కొనసాగించలేకపోయారు. ముఖ్యంగా పేలవ ఫీల్డింగ్‌తో అఫ్గాన్ మూల్యం చెల్లించుకోగా.. కివీస్ మాత్రం కండ్లు చెదిరే క్యాచ్‌లతో అదుర్స్ అనిపించింది.

చెన్నై: ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ నాలుగో విజయం నమోదు చేసుకుంది. ప్రత్యర్థితో సంబంధం లేకుండా మైదానంలో సంపూర్ణ ఆధిపత్యం కొనసాగిస్తున్న న్యూజిలాండ్ బుధవారం చెన్నై చెపాక్ స్టేడియంలో జరిగిన పోరులో 149 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్‌ను మట్టికరిపించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (71; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), టామ్ లాథమ్ (68; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), విల్ యాంగ్ (54; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. అఫ్గాన్ బౌలర్ల ధాటికి ఒక దశలో ఒక పరుగు వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయి 110/4తో కష్టాల్లో పడ్డట్లు కనిపించిన కివీస్‌ను కెప్టెన్ లాథమ్, ఫిలిప్స్ ఆదుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ.. క్రీజులో కుదురుకున్నాక బౌండ్రీల మోత మోగించింది. మరో సంచలనం ఖాయమే అనిపించేలా అఫ్గాన్ బౌలర్లు విజృంభిస్తుంటే.. ఫీల్డర్లు మాత్రం పేలవ ప్రదర్శనతో చేజేతులా మ్యాచ్‌ను దూరం చేశారు. అజ్మతుల్లా, నవీన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం అఫ్గాన్ 34.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. రహ్మత్ షా (36) టాప్ స్కోరర్ కాగా.. రహ్మానుల్లా (11), ఇబ్రహీం (14), హష్మతుల్లా (8), అజ్మతుల్లా (27), ఇక్రామ్ (19), మహమ్మద్ నబీ (7), రషీద్ ఖాన్ (8) విఫలమయ్యారు. కివీస్ బౌలర్లలో శాంట్నర్, ఫెర్గూసన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ఫిలిప్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఫిలిప్స్ (71)

ఆహా.. ఏమా క్యాచ్!

గత మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌ను మట్టికరిపించిన అఫ్గాన్.. ఈ మ్యాచ్‌లో పేలవ ఫీల్డింగ్‌కు మూల్యం చెల్లించుకుంది. లడ్డూలాంటి క్యాచ్‌లు అందుకోవడంలో కూడా కాబూలీలు తడబడ్డారు. మొత్తంగా ఈ మ్యాచ్‌లో ఐదు క్యాచ్‌లు, ఓ స్టంపింగ్ అవకాశం చేజారగా.. మ్యాచ్ గతిని మార్చిన లాథమ్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను కాబూలీలు అందుకోలేకపోయారు. ఆ రెండూ రషీద్ ఖాన్ బౌలింగ్‌లోనే కావడం గమనార్హం. న్యూజిలాండ్ మాత్రం కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకుంది. ముఖ్యంగా ఫెర్గూసన్ వేసిన 14వ ఓవర్లో శాంట్నర్ పట్టిన క్యాచ్ చూసి తీరాల్సిందే. అఫ్గాన్ కెప్టెన్ హష్మతుల్లా షార్ట్ బాల్‌ను పుల్ చేసేందుకు ప్రయత్నించగా.. అది కాస్తా గాల్లోకి లేచింది. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న శాంట్నర్ వెనక్కి పరిగెడుతూ.. అసాధ్యం అనుకుంటున్న సమయంలో ఒంటిచేత్తో బంతిని ఒడిసిపట్టి ఔరా అనిపించాడు!

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 50 ఓవర్లలో 288/6 (ఫిలిప్స్ 71, లాథమ్ 68; నవీన్ 2/48, అజ్మతుల్లా 2/56), **అఫ్గానిస్థాన్:** 34.4 ఓవర్లలో 139 ఆలౌట్ (రహ్మత్ షా 36; ఫెర్గూసన్ 3/19, శాంట్నర్ 3/39).

హో రాహోరీగా యోగా పోటీలు

• కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి యోగా టోర్నీ

కొత్తపల్లి: కరీంనగర్ జిల్లా వేదికగా 10వ రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర యోగా సంఘం, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మానేర్ స్కూల్‌లో పోటీలు జరిగాయి. ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి దాదాపు 700 మంది ప్లేయర్లు, 60 మంది కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక అధికారులు హాజరయ్యారు. 8 నుంచి 45 ఏండ్ల వయస్సు ఉన్న పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన ప్లేయర్లు నవంబర్ 23 నుంచి 26 వరకు గువాహటిలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక చేస్తారు. అంతకుముందు మానేరు విద్యాసంస్థల అధినేత, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాట్రన్ అనంత రెడ్డి, యోగా సంఘం ప్రధాన కార్యదర్శి మనోహర్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో 8 నుంచి 10 ఏండ్ల బాలికల విభాగంలో నితిగ్నదరి(ప్రథమ), అభిలాషరెడ్డి(ద్వితీయ), అమరిస్(తృతీయ) ప్రతిభ చాటారు. బాలుర కేటగిరీలో చిన్మయ్‌రెడ్డి(రంగారెడ్డి), కుష్వక్‌రెడ్డి(హైదరాబాద్), మన్విత్‌రామ్(కరీంనగర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

అగ్గిపుల్లపై 'ప్రపంచ కప్'

• కాటారం ఉపాధ్యాయుడి కళా సృష్టి

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన గురుకుల ఆర్ట్ టీచర్ ఆడెపు రజనీకాంత్ తన కళా నైపుణ్యంతో అగ్గిపుల్లపై వరల్డ్ కప్‌ను ఆవిష్కరించాడు. అగ్గిపుల్ల, చాక్‌పీస్, పెన్సిల్ గ్రాఫైట్‌పై అతి చిన్న పరిమాణంలో వీటిని చెక్కాడు. అగ్గిపుల్లపై 7 మి.మీ ఎత్తు, 2 మి.మీ వెడల్పుతో, చాక్‌పీస్‌పై 2.9 సెం.మీ ఎత్తు, 1 సెం.మీ వెడల్పుతో, పెన్సిల్ గ్రాఫిట్‌పై అతి చిన్న పరిమాణంలో 6 మి.మీ ఎత్తు, 2 మి.మీ వెడల్పు ఉన్న వరల్డ్ కప్‌ను సుమారు 5 గం.ల పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు. గతంలో సబ్బు, చాక్‌పీస్‌లపై అనేక కళాఖండాలను సృష్టించాడు. ప్రస్తుతం జరుగుతున్న క్రికెట్ పోటీలలో భారత్ వరల్డ్ కప్ సాధించాలని ఆకాంక్షతో వీటిని రూపొందించినట్లు తెలిపారు. పలువురు రజనీకాంత్ నైపుణ్యాన్ని అభినందించారు.

ముంబైకి బాండ్ బై బై

ముంబై: ముంబై ఇండియన్స్‌తో తొమ్మిదేండ్ల అనుబంధానికి బౌలింగ్ కోచ్ షేన్ బాండ్ ముగింపు పలికాడు. ఈ విషయాన్ని బుధవారం అధికారికంగా ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. 2015లో ముంబైతో కలిసిన ఈ న్యూజిలాండ్ పేసర్..సుదీర్ఘ కాలం తన సేవలందించాడు. బౌలింగ్ కోచ్‌గా ముంబై నాలుగు సార్లు ఐపీఎల్ ట్రోఫీలు గెలువడంలో బాండ్ కీలకంగా వ్యవహరించాడు. ముంబైతో పాటు ఎమ్ఐ ఎమిరేట్స్ చీఫ్ కోచ్ పదవి నుంచి బాండ్ తప్పుకున్నాడు. 'ముంబై ఇండియన్స్‌తో కలిసి పనిచేసే అవకాశం దక్కినందుకు అంబానీ కుటుంబానికి కృతజ్ఞతలు. గత తొమ్మిది సీజన్ల నుంచి ముంబై జట్టుతో కలిసి పనిచేశాను. ఇన్ని రోజుల వ్యవధిలో ఎన్నో మరుపురాని అనుభవాలు పొందాను' అని పేర్కొన్నాడు. శ్రీలంక మాజీ క్రికెటర్ లసిత్ మలింగను బౌలింగ్ కోచ్‌గా ఎంపిక చేసిన నేపథ్యంలో షేన్ బాండ్ తప్పుకున్నట్లు తెలిసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.